## క్లుప్తంగా

### రైతులకు న్యాయం చేస్తాం

**మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్**



**రావిర్యాల చెరువును పరిశీలిస్తున్న కేఎల్లార్, అధికారులు**

**తుక్కుగూడ:** మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల పెద్ద చెరువును ఆయకట్టు రైతుల విజ్ఞప్తి మేరకు గురువారం ఇరిగేషన్ అధికారులతో కలిసి మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులోని నీటిని బయటికి పంపించేందుకు రైతులు, అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయకట్టు రైతులకు న్యాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**రోడ్డు పనులను ప్రారంభిస్తున్న శివకుమార్**

**తుక్కుగూడ:** మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామంలో 4వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ మధుమోహన్, కౌన్సిలర్ శివకుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ యాదగిరిరెడ్డి, నాయకులు లింగం నర్సింహ, రవి, బాలయ్య, భిక్షపతి, సుయోధన్, మహేందర్, శ్రీకాంత్, అనిల్, నవీన్ పాల్గొన్నారు.

### యువతి అదృశ్యం



**నూర్ కయాస్ (ఫైల్)**

**పహాడీషరీఫ్:** యువతి అదృశ్యమైన ఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బర్మా దేశానికి చెందిన సితార బేగం శరణార్థులుగా కుటుంబంతో కలిసి బాలాపూర్ రాయల్ కాలనీలో నివాసం ఉంటోంది. సితార బేగం చిన్న కుమార్తె నూర్ కయాస్ (18) ఈ నెల 15వ తేదీ నుంచి కనిపించలేదు. కుటుంబసభ్యులు యువతి ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో గురువారం తల్లి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62366 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

# ఆరోగ్య ‘యోగ’ం

**యోగాతో ప్రశాంతత**

- ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం
- ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంత జీవనం
- భిక్షమయ్య గురూజీ



**అంతర్ముఖ యోగా శిక్షణకు హాజరైన ధ్యానులు**

**హుడాకాంప్లెక్స్:** యోగా అంటే వ్యాయామ సమాహారాల ఆధ్యాత్మిక రూపం. యోగా చేసే వారిని యోగులు అంటారు. ధ్యానయోగం ఆధ్యాత్మిక సాధనకు మానసిక ఆరోగ్యానికి ఎంతో తోడ్పడుతుంది. యోగా సాధనతో మనసును అంతర్ముఖం చేసుకున్నప్పుడు అలజడి తొలగిపోయి ప్రశాంతమైన స్థితిని పొందవచ్చు. హఠయోగంలోని ఆసనాలు శరీరారోగ్యానికి తొడ్పడి ఔషధవాడకాన్ని తగ్గించి దేహదారుఢ్యాన్ని ముఖ వర్చస్సును ఇనుమడింపజేస్తాయి. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికి యోగా సాధన ఔషధంగా పనిచేస్తుందని శ్రీ సత్యసాయి ధ్యాన మండలి సత్యసేవక్ భిక్షమయ్య గురూజీ తెలిపారు. హుడా కాంప్లెక్స్ లోటస్‌ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో, ఎల్‌బీనగర్, హస్తినాపురం, దిల్‌సుఖ్‌నగర్, బోడుప్పల్ ప్రాంతాల్లో ఉచితంగా పది రోజులుగా ధ్యాన యోగా శిక్షణ ఇస్తున్నారు. యోగా శిక్షణతో మానసిక, శారీరక ఆరోగ్యాన్ని అందజేస్తున్నారు. 30 ఏళ్లగా శ్రీ సత్యసాయి ధ్యానమండలి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా లక్షలాది మందికి యోగా శిక్షణ ఇస్తున్నారు.

**సంపూర్ణ ఆరోగ్యం**



భిక్షమయ్య గురుజీ సారథ్యంలో 20 ఏళ్లుగా శిక్షణ ఇస్తున్నారు. యోగా సాధన ద్వారా అందరిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. మా వద్ద శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉన్నామని చెబుతున్నారు.

– యోగారత్న ఇస్మాయిల్ గురూజీ

**ఎన్నో ప్రయోజనాలు**



2012లో యోగా శిక్షణ తీసుకున్నాను. ప్రతిరోజు యోగా సాధన చేస్తూ ఉన్నాను. ఇప్పటివరకు నేను, మా కుటుంబసభ్యులు ట్యాబ్లెట్‌తో పని లేకుండా రోజంతా ఆరోగ్యవంతంగా పనులు చేసుకొంటున్నాం. యోగాను నిరంతరం సాధన చేయడం వలన ఎన్నో ప్రయోజనాలు స్వయంగా పొందవచ్చు.

– అలుగుబెల్లి వెంకటరెడ్డి, హస్తినాపురం

## కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ల నియామకం



**నియామక పత్రం అందజేస్తున్న కేఎల్లాఆర్**

**పహాడీషరీఫ్:** జల్‌పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్లుగా సీనియర్ నాయకులు షేక్ జహంగీర్, తయ్యబ్ దయానీని నియమించారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లాఆర్ గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జల్‌పల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ద్వితీయ స్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందేలా కృషి చేస్తామని ప్రకటించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కార్యకర్తలందరిని ఏకతాటిపైకి తీసుకొస్తామని తెలిపారు. పదవులు అప్పగించినందుకు కేఎల్లాఆర్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు.

## జల్‌పల్లి అభివృద్ధికి కృషి

**చైర్మన్ అబ్దుల్లా సాదీ**



**సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న అబ్దుల్లా సాదీ**

**పహాడీషరీఫ్:** ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారంతో జల్‌పల్లి మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాదీ అన్నారు. ఎర్రకుంటలోని 1వ వార్డులో రూ.40 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కౌన్సిలర్ దిల్రుసా హసన్ షాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జల్‌పల్లిని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి బస్తీకి రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్లు వేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు హుస్సేన్, దయానీ, ఇబ్రహీం, మహ్మద్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌ల పంపిణీ



**విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు పంపిణీ చేసిన నాయకులు**

**కందుకూరు:** మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను పంపిణీ చేశారు. స్థానిక నాయకులు చిన్న నరసింహ, కంబాలపల్లి మదన్ పాల్‌రెడ్డి, శ్యాంసుందర్, వంగూరి వెంకటేశ్, వంగూరి శ్రీశైలయాదవ్ రూ.1.25 లక్షల విలువ గల స్పోర్ట్స్ డ్రెస్‌లను 200 మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మధుసూదన్‌యాదవ్, జంగయ్య, వెంకటేశ్, రాఘవేందర్, నరేశ్, నందిగామ శ్రీకాంత్, వినోద్, ఉపాధ్యాయులు కుమార్, శ్రీనివాసులు, హరిప్రసాద్, శ్రీధర్, రాంచందర్, సుచరిత, గణేశ్, భాగ్యలక్ష్మి నరసింహారెడ్డి, యాదీశ్వర్ పాల్గొన్నారు.

## విద్యాసాధికారత సాధించాలి

**ఐసీడీఎస్ సీడీపీఓ సక్కుబాయి**

**ఆమనగల్లు:** బాలికలు విద్యాసాధికారత సాధించాలని ఆమనగల్లు ఐసీడీఎస్ సీడీపీఓ సక్కుబాయి ఆకాంక్షించారు. ఆమనగల్లు మండలం రాంనుంతలలో జాతీయ బాలికా దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ సోన శ్రీనునాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులకు జాతీయ బాలికా దినోత్సవం గురించి అవగాహన కల్పించారు. అనంతరం కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యార్థినులకు ఆటల పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు. లింగ వివక్షత, బాలికా విక్రయాలు, బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవణా, పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర విషయాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సీడీపీఓ సక్కుబాయి మాట్లాడుతూ.. ‘ఆడపిల్లని పుట్టనిద్దాం.. బతకనిద్దాం.. చదవనిద్దాం’ అని పిలుపునిచ్చారు. బాలికలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోనాపూర్ ఎంపీటీసీ సరిత పంతునాయక్, కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రత్యేకాధికారి పద్మజ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భక్తశబరి, జయమ్మ, పార్వతి, పద్మ, మమత, కవిత, బాలమణి, తిరుమల ఉన్నారు.

## అదనపు డబ్బులు వసూలు చేయొద్దు

**మీసేవ నిర్వాహకులతో తహసీల్దార్ సమీక్ష**

**తలకొండపల్లి:** మీసేవా కేంద్రాల్లో అందించే సేవలకు ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే అదనంగా డబ్బులు వసూల్ చేయరాదని తహసీల్దార్ రంగారెడ్డి అన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం మీసేవా కేంద్రాల నిర్వాహకులు, సిబ్బందితో తహసీల్దార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రతి మీసేవా కేంద్రంలో ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా రేట్ చార్ట్‌ను పెట్టాలన్నారు. ప్రభుత్వం సూచించిన దానికంటే అదనంగా డబ్బులు వసూల్ చేసినట్లు తెలిస్తే ఆథరైజేషన్ రద్దు చేయడానికి సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని హెచ్చరించారు.

## స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

**మాడ్గుల:** మండల పరిధిలోని కలకొండ గ్రామంలోని ప్రధాన రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయలని మాడ్గుల పీఎస్ సీఐ రాజశేఖర్ గౌడ్, మండల తహసీల్దర్ నిరంజన్‌ను గ్రామస్తులు కలసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో స్పీడ్ బ్రేకర్లు లేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆమనగల్లు నుంచి ఇర్విన్ రహదారిలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉందని.. స్పీడ్ బ్రేకర్లు లేక అతివేగంతో వచ్చి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుపైనే పాఠశాల ఉండటంతో విద్యార్థులకు పాఠశాలకు వెళ్లాలన్నా ఇబ్బందిగా మారిందని వారు వివరించారు. అధికారులు స్పందించి వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయలని వినతిపత్రంలో కోరారు. వినతి పత్రం అందించిన వారిలో బాలరాజుగౌడ్, ఎల్లికంటి సైదులు, డోంకి శ్రీనివాసులు, గోరిట్ల మల్లేష్, మహబుబ్ అలి, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా ఉంటాం

**రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్**

**కడ్తాల్:** మండల పరిధిలోని గానుగుమార్లతండా పంచాయతీ పరిధిలోని కానుగుబావితండాకు చెందిన నిరుపేద కొర్ర రవి కుటుంబానికి సొంత ఇళ్లు లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురయ్యారు. గతంలో కానుగుబావితండాలో పర్యటించిన సందర్భంలో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ దశర థ్‌నాయక్, రవి కుటుంబానికి ట్రస్ట్ ద్వారా ఇంటి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఇటీవల ఇంటి నిర్మాణం పూర్తి చేయించారు. గురువారం దశరథ్‌నాయక్ ఆ ఇంటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హంశమోత్యానాయక్, ఉప సర్పంచ్ శారద, నాయకులు పాండునాయక్, చందర్, రాజు, రవి, కిషన్ తదితరులు ఉన్నారు.

## శివ స్వాములకు సన్నిధానం షెడ్డు నిర్మాణం

**దిల్‌సుఖ్‌నగర్:** ఎల్‌బీనగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శివశక్తి సేవా సమితి ఆధ్వర్యంలో మాలధారణ చేస్తున్న శివ స్వాములు అదే ఆలయంలో ఉంటున్నారు. శివస్వాములకు అనువైన సన్నిధానం లేదని తెలుసుకున్న యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి వారి కోసం సన్నిధానం ఏర్పాటు చేసేందుకు పూనుకున్నారు. స్వాములు పూజలు చేసుకొని, ఉండటానికి అనుకూలంగా షెడ్డు నిర్మించి ఫ్లోరింగ్ చేయించారు. రేపు మాలధారణ కోసం శివస్వాములు శ్రీశైలం భ్రమరాంబిక క్షేత్రానికి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో శివశక్తి సేవా సమితి అధ్యక్షుడు, గురుస్వామి కాటం రాజుతో పాటు వారి బృందం సభ్యులందరూ చిలుక ఉపేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాజేష్ కుమార్, వెంకటేష్, జగదీశ్, బాలకృష్ణ, కుమార స్వామి, మల్లేష్, సంజయ్, సైదులు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్కడ చూసినా చెత్త కుప్పలే!

- ఎల్బీనగర్ నియోజకవర్గంలో పడకేసిన పారిశుద్ధ్యం
- కాలనీల్లో అనధికార డస్ట్ బిన్లు
- వ్యర్థాల కోసం చేరుతున్న పందులు, కుక్కలు



**వనస్థలిపురం ఫేజ్-4లో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త**

**వనస్థలిపురం:** ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణ కొరవడింది. పలు ప్రాంతాల్లో రోడ్ల వెంబడి, ఖాళీ స్థలాల్లో చెత్తకుప్పలు పేరుకుపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో పందులు, కుక్కలు స్వైర విహారం పెరిగింది. శానిటేషన్ అధికారుల పర్యవేక్షణ లోపం, సరిపడా సిబ్బంది లేకపోవడంతోనే పారిశుద్ధ్య పనులు సరిగా జరగడం లేదని కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు.

- వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, హస్తినాపురం, హయత్‌నగర్ తదితర డివిజన్లలో రోడ్ల వెంబడి, ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోతోంది. జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన డస్ట్ బిన్‌లే కాకుండా పలు ప్రాంతాలలో అనధికారికంగా డస్ట్ బిన్లు ఏర్పాటు చేస్తున్నారు.
- కాలనీల్లో కొందరు ఇళ్ల వద్దకు వచ్చిన చెత్త రిక్షాలు, ఆటోలకు చెత్త వేయకుండా.. కవర్లలో తెచ్చిన చెత్తను ఖాళీ స్థలాలు, రోడ్లపై పారవేస్తుంటంతో అక్కడ చెత్త పేరుకుపోతోంది.
- ఆయా ప్రాంతాల్లో చెత్తను వేయకుండా నియంత్రించడంలోను, చెత్తను సకాలంలో తొలగించడంలోనూ శానిటేషన్ అధికారులు విఫలవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాలు చెత్తకుప్పలుగా మారి పందులు, కుక్కలకు నిలయాలుగా మారుతున్నాయంటున్నారు.
- శివారు ప్రాంతాలలో శానిటేషన్ సిబ్బంది సరిపడా లేరని, ఉన్నవారు కూడా నిర్ణీత సమయం వరకు పనిచేయడం లేదని, వారిపై శానిటేషన్ అధికారుల అజమాయిషీ లోపించిందని స్థానికులు అంటున్నారు.
- పలు కాలనీల్లో పోగేసిన చెత్తను డంప్ ప్రాంతాలకు తరలించకుండా కాలనీల్లోనే కుప్పలు చేసి కాల్చి వేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే కాలనీలు అపరిశుభ్రంగా మారుతున్నాయని అంటున్నారు.



**వనస్థలిపురం పోలీసుస్టేషన్ వెనుక..**



**హస్తినాపురంలో..**



## ప్రజాస్వామ్యానికి ఓటే పునాది



**యువకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్, సీఐ తదితరులు**

**కందుకూరు:** ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని, ఓటు హక్కు పొందడం ప్రతి పౌరుడి బాధ్యత అని తహసీల్దార్ గోపాల్, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువతతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్నికలప్పుడు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. దీంతో ప్రజల సమస్యలు పరిష్కరించే వారిని ఎన్నుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శేఖర్, ఆర్ఐ ప్రేమ్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### క్రీడల్లోనూ రాణించాలి

**సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి**

**కడ్తాల్:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని స్థానిక సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు నిర్వహించిన క్రీడాపోటీలను స్థానిక నాయకులతో కలిసి సర్పంచ్ ప్రారంభించారు. క్రీడలు విద్యార్థుల మానసిక వికాసానికి దోహదపడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లయ్య, జంగయ్య, శరత్‌చంద్ర, పీఈటీ చంద్రమోహన్, స్థానిక నాయకులు ఉన్నారు.

### విద్యార్థులకు పద్యాల పోటీలు

**మంచాల:** మంచాల మండల పరిధిలోని ఆరుట్ల మోడల్ స్కూల్‌లో వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం తెలుగు పద్యాల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు హరినాథ్‌రెడ్డి, ఉషారాణి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కళ్యాణ్ చక్రవర్తి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

**ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలోని వివిధ ఫర్టిలైజర్ షాపులను గురువారం తహసీల్దార్ లలిత, వ్యవసాయాధికారి అరుణకుమారి తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో ఉన్న స్టాకును పరిశీలించారు. ఎప్పటికప్పుడు స్టాకు వివరాలను, అమ్మకాల వివరాలను ఈపాస్‌లో నమోదు చేయాలని వ్యాపారులకు సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

**ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులును గురువారం స్థానిక నేతలు ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతం బాల్‌రాజ్, ఆ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎన్ను గోవర్దన్‌రెడ్డి, వర్తక సంఘం నాయకులు నెల్లి కుమార్, జమీర్, సయ్యద్, సాదిక్, అలీ, మునీర్, రమేష్ తదితరులు సీఐని కలిసి ఘనంగా సన్మానించారు. సీఐ ఆంజనేయులు మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు అందరి సహకారం కావాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎవ్వరినైనా ఉపేక్షించేదిలేదని.. వారిపట్ల చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.